RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 92 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శనివారం | 03.10.2026 | పేజీలు : 8

కొడంగల్‌లో సభతో రేవంత్ రెడ్డికి చెమటలు పట్టిస్తాం - తలసాని



- కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ పెడతామన్న తలసాని
- సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్న
- ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాల్ విసురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది.హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని .....

» 2

పాఠశాలల్లో అల్పాహార పథకం..

- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

- సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



నిత్యం నిఘా, హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ .....

» 2

గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి : భట్టి విక్రమార్క

- గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపు
- వివక్ష లేని సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ



» 2

జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

డిజిటల్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి





» 2

గాంధీ జయంతి వేళ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఫైర్

- గాంధీ ఆరాధించిన రాముడు ధనికుల దేవుడా అని కాంగ్రెస్‌ను నిలదీత
- గాంధీ ఆశయాలను ప్రధాని మోదీ నెరవేరుస్తున్నారని, నిజమైన వారసులు బీజేపీయేనని వ్యాఖ్య
- ఓటమి తర్వాత ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌పై ఘాటు విమర్శలు



» 2

రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

- మంత్రి కోమటిరెడ్డి హామీ

- ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడి
- యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపేందుకు ప్రయత్నాలు
- కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందపడుతున్నాయని విమర్శ




వివరాలు 2 లో



ఇద్దరు పాక్ చొరబాటుదారులను కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు

- పంజాబ్ సరిహద్దులో ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులు హతం
- టార్న్ టారన్ జిల్లాలో చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన బీఎస్ఎఫ్
- హెచ్చరికలు పటించుకోకపోవడంతో కాల్పులు జరిపిన దళాలు

» 2



హైదరాబాద్‌లో సంతోషిమాత విగ్రహంపై కర్రలతో దాడి


- హైదరాబాద్‌లోని సంతోషిమాత ఆలయంలో విగ్రహంపై దాడి
- పూజలు చేస్తుండగా కర్రలతో విగ్రహాన్ని కొట్టిన ఆగంతుకుడు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న చైతన్యపురి పోలీసులు
- ఘటనను ఖండించిన బీజేపీ నేతలు, దిల్‌సుఖ్‌నగర్‌లో ఆందోళన

» 2

టీజీ ట్రాన్స్‌కోలో 26% వాటాల విక్రయాన్ని ఆపాలి

- రాహుల్ గాంధీ కి హరీష్ రావు లేఖ

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ
- టీజీ ట్రాన్స్‌కోలో 26% వాటాల విక్రయాన్ని ఆపాలని వినతి
- ఇది విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు తొలి అడుగని ఆందోళన
- కాంగ్రెస్ జాతీయ విధానాలకు ఇది విరుద్ధమని లేఖలో ప్రస్తావన



నిత్యం నిఘా, డెస్క్ : తెలంగాణలోని కీలక విద్యుత్ రంగ సంస్థల్లో వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖ రాశారు. టీజీ ట్రాన్స్‌కోలో 26 శాతం వాటాలను ఐపీఓ ద్వారా విక్రయించి నిధులు సమీకరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాధనంతో నిర్మితమైన టీజీ ట్రాన్స్‌కో, రాష్ట్ర విద్యుత్ సరఫరా వ్యవస్థకు వెన్నెముక వంటిదని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. వేలాది కిలోమీటర్ల మేర విస్తరించిన విద్యుత్ లైన్లు, హై-వోల్టేజ్ సబ్‌స్టేషన్లతో కూడిన ఈ సంస్థ అత్యంత విలువైన ఆస్తి అని .....

2



ముంబైలో పోటాపోటీ నిరసనలు..

సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్' ఆందోళన

- సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ ముంబైలో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన
- సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబై' గ్రూప్ కౌంటర్ నిరసన
- పోటాపోటీ ప్రదర్శనలతో ముంబైలో ఉద్రిక్త వాతావరణం
- సోషల్ మీడియాలోనూ ఇరువర్గాల మద్దతుదారుల మధ్య మాటల యుద్ధం

» 2

పాఠశాలల్లో అల్పాహార పథకం

మొదటిపేజీ తరువాయి.. విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

- మంత్రి కోమటిరెడ్డి హామీ

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

ఇద్దరు పాక్ చొరబాటుదారులను కాల్చి చంపిన బీఎస్ఎఫ్ బలగాలు

మొదటిపేజీ తరువాయి.. పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇద్దరు పాకిస్తానీ చొరబాటుదారులను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఈరోజు కాల్చి చంపింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు వారు చేసిన ప్రయత్నాన్ని బీఎస్ఎఫ్ దళాలు సమర్థవంతంగా భగ్నం చేశాయి. ఈ ఘటనలో మరో చొరబాటుదారుడు పాకిస్తాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో ఉన్న రాజోకే బోర్డర్ అవుట్‌పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన జరిగింది. పాకిస్తాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా భారత భూభాగం వైపు వస్తుండటాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన దళాలు, ముందుకు రావొద్దని వారిని హెచ్చరించాయి. అయితే, పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోకుండా ముందుకు సాగడంతో బీఎస్ఎఫ్ కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారిని ఇంకా అధికారికంగా గుర్తించలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంజాబ్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో సోదాలు కొనసాగుతున్నాయి.

హైదరాబాద్‌లో సంతోషిమాత విగ్రహంపై కర్రలతో దాడి

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భవానీ నగర్ కాలనీలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఉదయం పూజలు జరుగుతుండగా ఒక వ్యక్తి అమ్మవారి విగ్రహంపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో భక్తులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే, ఆలయంలో పూజలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి లోపలికి ప్రవేశించాడు. నేరుగా గర్భగుడిలోకి వెళ్లి తన చేతిలోని కర్రలతో విగ్రహంపై దాడి చేయడం ప్రారంభించాడు. ఈ హఠాత్పరిణామాంతో భయాందోళనకు గురైన భక్తులు కేకలు వేశారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎల్బీ నగర్ ఏసీపీ రవీంద్ర రెడ్డి నిందితుడిని అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆలయ ఛైర్మన్ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని మహమ్మద్ అన్సారీగా పోలీసులు గుర్తించారు. అతను కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు పోలీసు వర్గాల సమాచారం. నిందితుడు గర్భగుడిలోకి వెళ్లి విగ్రహంపై దాడి చేస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నామమాత్రపు కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ రంగారెడ్డి అర్బన్ బీజేపీ అధ్యక్షుడు వాణిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తదితరులు దిల్‌సుఖ్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. ఆలయాలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆందోళనకారుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఈ ఘటనపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నారు.

గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి : భట్టి విక్రమార్క

మొదటిపేజీ తరువాయి.. గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

టీజీ ట్రాన్స్‌కోలో 26% వాటాల విక్రయాన్ని ఆపాలి

- రాహుల్ గాంధీ కి హరీష్ రావు లేఖ

మొదటిపేజీ తరువాయి.. వివరించారు. ట్రాన్స్‌కోలో ప్రైవేట్ వాటాలకు అనుమతినిస్తే, భవిష్యత్తులో టీజీ జెన్‌కో, సింగరేణి, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు కూడా ఇది మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టో, 2023 రాయ్‌పూర్ తీర్మానాలకు విరుద్ధమని హరీశ్ రావు ప్రశ్నించారు. వ్యూహాత్మకంగా ప్రాధాన్యత లేని, నష్టాల్లో ఉన్న సంస్థల్లో మాత్రమే పెట్టుబడుల ఉపసంహరణకు కట్టుబడి ఉన్నామని గతంలో కాంగ్రెస్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీ వంటి సంస్థలను ప్రైవేటీకరిస్తుంటే తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, రాష్ట్రంలో అధికారంలోకి రాగానే అందుకు భిన్నంగా వ్యవహరించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని నిలదీశారు. విద్యుత్ సంస్థల యాజమాన్య హక్కులపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ప్రైవేటీకరణ, వాటాల విక్రయం లేదా పబ్లిక్ ఇష్యూపై ఇప్పటి వరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని టీజీ ట్రాన్స్‌కో వర్గాలు వెల్లడించాయి.

కొడంగల్‌లో సభతో రేవంత్ రెడ్డికి చెమటలు పట్టిస్తాం - తలసాని

మొదటిపేజీ తరువాయి.. ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు. ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

ముంబైలో పోటాపోటీ నిరసనలు.. సీజేపీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ' ఆందోళన

మొదటిపేజీ తరువాయి.. ముంబైలో శుక్రవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఓవైపు నిరసనలు చేపట్టగా, మరోవైపు ఆ పార్టీకి వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబై' బృందం కౌంటర్ ప్రదర్శన నిర్వహించింది. ఈ పోటాపోటీ ఆందోళనల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ జయంతి సందర్భంగా సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, ముంబైలోని శివాజీ పార్క్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు జరిగాయి. తమ నిరసనకు ప్రజలు మద్దతు ప్రకటించాలని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ విజ్ఞప్తి చేశారు. వీరికి ప్రతిగా జెన్ నెక్ట్స్ ముంబై సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, "అభిజీత్ దీప్కే వంటి వ్యక్తులు రాజ్యాంగాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారు. కానీ రాజ్యాంగాన్ని ఎలా కాపాడుకోవాలో, ఎలా గౌరవించాలో మాకు తెలుసు. అందుకే మేం బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నాం. కాక్రోచ్ జనతా పార్టీ వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం" అని స్పష్టం చేశారు. ఈ పోటాపోటీ ప్రదర్శనల ప్రభావంతో సోషల్ మీడియాలోనూ ఇరు వర్గాల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కొందరు జెన్ నెక్ట్స్ మద్దతుదారులు సీజేపీ సభ్యులను 'దిమాగీ నక్సల్స్'గా అభివర్ణించగా, జెన్ నెక్ట్స్ నిరసనల వెనుక బీజేపీ హస్తం ఉందని సీజేపీ వర్గాలు ఆరోపించాయి. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు, భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సీజేపీ చేస్తున్న ప్రచారం ఏ స్థాయిలో విభేదాలకు దారితీసిందో ఈ ఘటనలు అద్దం పడుతున్నాయి.

గాంధీ జయంతి వేళ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఫైర్

మొదటిపేజీ తరువాయి.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం గాంధీ జయంతి వేడుకల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జమ్మికుంటలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీ వారసత్వం తమదేనని చెప్పుకునే నైతిక అర్హత ఆ పార్టీలకు లేదని ఆయన విమర్శించారు. శ్రీరాముడిని "ధనికుల దేవుడు"గా అభివర్ణించిన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిత్యం 'రామ' నామాన్ని జపించిన గాంధీ ఆరాధించిన రాముడు, కేవలం ధనికులకే దేవుడా, లేక ప్రజలందరి దేవుడా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను బండి సంజయ్ ప్రశ్నించారు. గాంధీజీ సత్యం, ధర్మం, న్యాయంతో కూడిన సనాతన ధర్మాన్ని పాటించారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్, వారసత్వ రాజకీయాలు, అవినీతి, హిందూత్వ వ్యతిరేకత విధానాలతో నడిచే "ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అని, దీనిని నడిపిస్తున్నది "డూప్లికేట్ గాంధీ కుటుంబం" అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిందూ సమాజాన్ని విభజించే కుట్రలు చేస్తోందని విమర్శించారు. మరోవైపు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై గాంధీ, అంబేద్కర్ వంటి జాతీయ నేతల జయంతి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రజా జీవితానికి దూరమైన కేసీఆర్, ప్రపంచంలోనే అత్యంత అహంకారపూరిత నాయకుడని దుయ్యబట్టారు. గాంధీ కలలు కన్న రామరాజ్యం, స్వచ్ఛ భారత్ వంటి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తోందని, గాంధీకి నిజమైన వారసులు తామేనని ఆయన స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికను ప్రస్తావిస్తూ, ఈ ఎన్నిక రావడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని సంజయ్ ఆరోపించారు. ఆ నియోజకవర్గంలోని 2 లక్షల మంది హిందూ ఓటర్లను విస్మరించి, కేవలం 32,000 ముస్లిం ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసినా ప్రజలు వారిని తిరస్కరిస్తారని, ఖైరతాబాద్‌లో హిందూ ఓటర్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. "డబుల్ ఇంజిన్" సర్కారుతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- డిజిటల్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

హన్మకొండ, అక్టోబర్02(నిత్యం నిఘా ప్రతినిధి): జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సమాజంలో డిజిటల్ మీడియా విస్తరిస్తున్న నేపథ్యంలో మీడియా రంగానికి సంబంధించిన విధానపరమైన సిఫార్సుల కోసం ప్రత్యేకంగా కొత్త మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. శుక్రవారం హన్మకొండలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని, ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియా ఉద్యోగులకు వర్తించేలా కొత్త వేతన బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డిజిటల్ మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన నాగరాజు మాట్లాడుతూ ముద్రణ, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా అనే తేడాలు లేకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు వైద్య సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రధాన జర్నలిస్టు సంఘాలు ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోయాయని





వారు పేర్కొన్నారు. డిజిటల్ మీడియా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ సలహాదారు రాజేశ్వరరావు, కోశాధికారి వంశీ, ఉపాధ్యక్షుడు మోహన్‌రావు, సహాయ కార్యదర్శి నగేష్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

శనివారం 03 - 10 - 2026

నిత్యం నిఘా తెలుగు దినపత్రిక



తలవంచలేదు.. పోరాటాన్ని వీడలేదు

● ఉద్యమంలో ముందున్నా.. స్వరాష్ట్రంలో అధికారానికి దూరమయ్యా
● ఉద్యమం నుంచి న్యాయస్థానం వరకు : గుడిమళ్ళ రవికుమార్ ప్రస్థానం

వరంగల్, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి) : తలవంచి బతకడం తనకు తెలియదని, సమస్యలను ప్రశ్నిస్తూ ఎదురిస్తూ జీవితాన్ని కొనసాగించానని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమళ్ళ రవికుమార్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన తనలాంటి ఉద్యమకారులకు స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజకీయ, అధికార వ్యవస్థల్లో తగిన భాగస్వామ్యం ఎందుకు లభించలేదన్నదే తన ప్రశ్న అని పేర్కొన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు, న్యాయం దక్కలేదన్న భావనతోనే మరోసారి పోరాటం చేపట్టాల్సి వచ్చిందన్నారు. తెలంగాణ డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో గుడిమళ్ళ రవికుమార్ తన బాల్యం నుంచి సామాజిక, న్యాయ, రాజకీయ ప్రస్థానం వరకు పలు అంశాలను వెల్లడించారు. వరంగల్‌లో పుట్టి రంగంపేటలో పెరిగిన తన బాల్యం సామాజిక అసమానతలను దగ్గరగా అర్థం చేసుకునేలా చేసిందన్నారు. తల్లి గుడిమళ్ళ పుష్పలీల ఎంజీఎంలో నర్సుగా, తండ్రి రాఘవేందర్‌రావు ఫార్మసిస్ట్‌గా పనిచేశారని తెలిపారు. వరంగల్‌లో విద్యాభ్యాసం అనంతరం ఎస్వీ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్యను అభ్యసించానన్నారు.

మ్యాజిక్ వేదికే తొలి పాఠశాల



మ్యాజిక్ ప్రదర్శనలు తన జీవితంలో కీలక మలుపుగా నిలిచాయని రవికుమార్ తెలిపారు. మెజీషియన్ ఉమాపతి వద్ద మ్యాజిక్ నేర్చుకుని వందలాది ప్రదర్శనలు ఇచ్చానని చెప్పారు. పది మంది ముందు నిలబడి మాట్లాడటం, విషయాన్ని స్పష్టంగా వివరించడం, ప్రజలను ఆకట్టుకునేలా మాట్లాడే ధైర్యం అక్కడే వచ్చిందన్నారు. 1982లో మిత్రులతో కలిసి మూన్‌లైట్ యూత్‌ను ఏర్పాటు చేసి వ్యాయామశాలను నిర్వహించడంతో పాటు నవ



చైతన్య అసోసియేషన్ ద్వారా కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మహిళా విద్యార్థినుల రక్షణ, వరద బాధితులకు సహాయం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నానన్నారు.

సామాజిక ఉద్యమాల నుంచి తెలంగాణ ఉద్యమం వైపు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1980 నుంచి 2000 మధ్య నెలకొన్న హింసాత్మక పరిస్థితులు తనను తీవ్రంగా ప్రభావితం చేశాయని ఆయన తెలిపారు. ఎన్‌కౌంటర్లు, మందుపాతరలు, అమాయకుల మరణాలు తనను కలచివేశాయని చెప్పారు. తెలంగాణ వెనుకబాటుతనం, ప్రాంతీయ అసమానతలపై అధ్యయనం చేసి ప్రత్యేక రాష్ట్ర సాధన అవసరాన్ని గుర్తించానన్నారు. శాంతియుత ప్రజా తెలంగాణ కోసం ఉద్యమంలో భాగస్వామినయ్యానని తెలిపారు. తెలంగాణ ప్రజా సమితి సదస్సులకు హాజరై ప్రొఫెసర్ జయశంకర్, ప్రజాకవి కాళోజీ నారాయణరావు, గాంధేయవాది భూపతి కృష్ణమూర్తి, ఆచార్య బి. జనార్ధన్‌రావు, ఆచార్య కూరపాటి వెంకటనారాయణ తదితరులతో కలిసి వేదికలు పంచుకున్నానని వివరించారు.

న్యాయస్థానంలోనూ పేదల తరపునే

1995లో న్యాయవాద వృత్తిలోకి వచ్చిన తర్వాత కోర్టులోనూ వివక్షను ఎదుర్కొన్నానని రవికుమార్ తెలిపారు. చట్టాలపై పట్టు, ఆంగ్లం, హిందీ భాషలపై అవగాహనతో వృత్తిలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నానన్నారు. పేదలు, ఉద్యమకారుల కేసులను అనేక సందర్భాల్లో ఎలాంటి పారితోషికం తీసుకోకుండా వాదించానని చెప్పారు. 1998లో యువ న్యాయవాదుల సంఘాన్ని ఏర్పాటు చేసి న్యాయవాదుల వృత్తి నైపుణ్యాల పెంపునకు కార్యక్రమాలు నిర్వహించానన్నారు.

పార్టీ ఆవిర్భావ రోజే గులాబీ కండువా

కొత్త రాజకీయ పార్టీ అవసరంపై 1998–99 ప్రాంతంలోనే ప్రొఫెసర్ జయ శంకర్‌తో చర్చించానని రవికుమార్ తెలిపారు. 2001లో పార్టీ ఆవిర్భావ రోజున హైదరాబాద్‌లోని జలదృశ్యంలో ఏడుగురు న్యాయవాదులతో కలిసి గులాబీ కండువా కప్పుకున్నానన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు ఉద్యమ నేతలపై నమోదైన కేసుల్లో పారితోషికం తీసుకోకుండా న్యాయపరమైన సహాయం అందించానని చెప్పారు. యువజన విభాగం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పల్లెపల్లెకు వెళ్లి పార్టీ నిర్మాణంలో పనిచేశానని తెలిపారు. ఆటోడ్రైవర్లు, పూల వర్తకులను సంఘటితం చేసి ఉద్యమంలో భాగస్వాములను చేశానన్నారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలన్నదే తన అభిప్రాయమని చెప్పారు.

ఎంపీ టికెట్ దక్కలేదని ఆవేదన





వరంగల్ ఎంపీ టికెట్ తనకు దాదాపుగా ఖరారైనప్పటికీ చివరి దశలో దక్కలేదని రవికుమార్ తెలిపారు. తనపై కొందరు నాయకులు రాజకీయంగా వ్యతిరేకంగా వ్యవహరించారని, తాను ఎన్నికై వస్తే తమ రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో నాయకత్వానికి తప్పుడు నివేదికలు ఇచ్చారని ఆరోపించారు. ఆ పరిణామాల కారణంగానే టికెట్ దూరమైందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఉద్యమకారుల కుటుంబాల పరిస్థితిపై ఆందోళన

తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమకారుల కుటుంబాల పరిస్థితిని తెలుసుకునేందుకు ఓదార్పు యాత్ర చేపట్టామని ఆయన తెలిపారు. సెప్టెంబర్ 17న వరంగల్‌లోని తొలిదశ ఉద్యమ అమరవీరుల స్తూపం వద్ద ప్రారంభమైన యాత్ర నాలుగు రోజులపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొనసాగిందన్నారు. మొత్తం 126 ఉద్యమకారుల కుటుంబాలను కలిశామని చెప్పారు. ఉద్యమంలో త్యాగాలు చేసిన కుటుంబాలు ఇప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

డిమాండ్ల సాధన వరకు పోరాటం

ఉద్యమకారుల హక్కుల సాధన కోసం తమ పోరాటం కొనసాగుతుందని గుడిమళ్ళ రవికుమార్ స్పష్టం చేశారు. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల నివాస స్థలం, రూ.10 వేల కోట్లతో సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు, బాధిత కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని తెలిపారు. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు స్వరాష్ట్రంలో న్యాయం జరగాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి గళమెత్తిన టీయూడబ్ల్యూజే

- ఇండ్ల స్థలాలు, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి..
  టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో డిమాండ్ల దినోత్సవం





హనుమకొండ, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐజేయూ అనుబంధ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డిమాండ్ల దినోత్సవం నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పబ్లిక్ గార్డెన్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి అందజేశారు. అలాగే వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులను కలిసి సమస్యలను వివరించి వినతిపత్రాలు సమర్పించారు.దేశంలో మారుతున్న మీడియా రంగ పరిస్థితులను సమగ్రంగా సమీక్షించి విధానపరమైన సిఫార్సులు చేసేందుకు కొత్త మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని జర్నలిస్టులు కోరారు. మీడియా సిబ్బంది, వార్తా సంస్థల భద్రతకు ప్రత్యేక కేంద్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కొత్త కార్మిక చట్టాల్లో విలీనమైన 1955, 1958 నాటి వర్కింగ్ జర్నలిస్టుల ప్రత్యేక చట్టాల ద్వారా గతంలో కల్పించిన హక్కులు, ఉద్యోగ భద్రత, పని గంటలు, వివాద పరిష్కారం, సేవల విరమణకు సంబంధించిన రక్షణలను పునరుద్ధరించాలని కోరారు.ప్రింట్, ప్రసార, డిజిటల్ మీడియా ఉద్యోగులకు వర్తించేలా కొత్త వేతన బోర్డును వెంటనే ఏర్పాటు చేసి ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు వైద్య సదుపాయాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. స్వేచ్ఛాయుతమైన, ఆర్థికంగా భద్రమైన మీడియా వ్యవస్థ ప్రజాస్వామ్యానికి అవసరమని, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం ఇకనైనా పరిష్కరించాలని నాయకులు అన్నారు. ఐజేయూ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆందోళనలను పక్కదారి పట్టించేలా కొందరు యూనియన్ నాయకులు 'పోస్ట్‌కార్డుల' పేరుతో కొత్త కార్యక్రమాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యం ఇవ్వని వారు ప్రస్తుతం జర్నలిస్టులకు నీతులు చెప్పడం సరికాదన్నారు. గతంలో జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోకుండా పాలాభిషేకాలతో కాలం గడిపిన వారిని జర్నలిస్టులు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవ మూర్తి, కార్యదర్శి ఊటుకూరు సాయిరామ్, రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, జాతీయ మండలి సభ్యులు పీవీ మదన్ మోహన్, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, జిల్లా కోశాధికారి పొడిశెట్టి విష్ణువర్ధన్, ప్రెస్ క్లబ్ కోశాధికారి బోల్ల అమర్‌తో పాటు పలువురు జర్నలిస్టు నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం

- సత్యం, అహింస, శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలి: దాస్యం వినయ్ భాస్కర్



హనుమకొండ, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, హనుమకొండ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ చిత్రపటానికి దాస్యం వినయ్ భాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ బోధించిన సత్యం, అహింస, శాంతి, సహనం, సామాజిక సమానత్వం వంటి ఆశయాలు నేటి సమాజానికి సైతం స్ఫూర్తిదాయకమని అన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో పయనిస్తూ సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ అందించిన సేవలను, ఆయన అనుసరించిన సిద్ధాంతాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహాత్మా గాంధీకి నివాళులర్పించారు.

దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి

- నాయుడు పెట్రోల్ పంపు లేదా ఉర్సుగుట్ట జంక్షన్ వద్ద విగ్రహం నెలకొల్పాలి



వరంగల్, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడైన బీసీ కులానికి చెందిన కురుమ ముద్దుబిడ్డ దొడ్డి కొమురయ్య రూపురేఖలు, పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేసేలా వరంగల్ నగరంలో ప్రభుత్వపరంగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వరంగల్ జిల్లా కురుమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కురుమ సంఘం కన్వీనర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కొండా సురేఖ మురళీధరరావుకు వినతిపత్రం అందజేశారు.2027 సంవత్సరంలో దొడ్డి కొమురయ్య జన్మించి 100 సంవత్సరాలు పూర్తికానున్న నేపథ్యంలో ఆయన సేవలు, పోరాట పటిమను కేవలం నాలుగు గోడల మధ్య స్మరించుకోవడం కాకుండా, ప్రజలకు కనిపించేలా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంఘం నాయకులు కోరారు. వరంగల్ నగరంలోని నాయుడు పెట్రోల్ పంపు జంక్షన్ లేదా ఉర్సుగుట్ట జంక్షన్ వద్ద ప్రభుత్వ స్థలంలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే హంటర్ రోడ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి రంగసాయిపేట నాయుడు పెట్రోల్ పంపు జంక్షన్ వరకు ఉన్న ప్రధాన రహదారికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని ఎమ్మెల్యేను కోరారు. ఆయన చరిత్రను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఆయన చేసిన త్యాగాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. కురుమ సంఘం వినతిపై ఎమ్మెల్యే కొండా సురేఖ స్పందిస్తూ వరంగల్ నగరంలో విగ్రహం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించే విషయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని కురుమ సంఘం నాయకులకు హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో కురుమ సంఘం నాయకులు కోరే కృష్ణ, చీర అశోక్, మిరియాల కుమారస్వామి, చీర భరత్, కుండె సదానందం, కోరే కుమారస్వామి, గొట్టే సదానందం, గౌడ కోటేశ్వర్, కొలుపుల కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

11న బీసీ ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా సదస్సు

- కరపత్రాన్ని ఆవిష్కరించిన వ్యవస్థాపక అధ్యక్షులు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి చిరంజీవులు



జనగాం జిల్లా ,అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి) : బీసీ ఇంటలెక్చువల్ ఫోరం జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న బీసీ కుల గణన – రాజ్యాధికార సాధన అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సులో వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు కోరారు. స్థానిక కెమిస్ట్రీ భవన్ లో నిర్వహించే ఈ సభలో బీసీల సామాజిక ఆర్థిక, విద్య, రాజకీయ హక్కులకు చట్టబద్ధమైన ప్రత్యేక రక్షణ చట్టం రూపొందించాలని పాలకవర్గాలను డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు రూపొందించిన కరపత్రాన్ని శుక్రవారం ఆయన కెమిస్ట్రీ భవన్ ముందు ఫోరం నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే వీరస్వామి, చిన్న శ్రీకాంత్, లింగేష్ యాదవ్, ఫోరం జనగామ జిల్లా శాఖ అధ్యక్షులు గద్దె అనిల్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు రంగు రాజశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మారగోని సిద్దయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి డిమాండ్

- హక్కులు, భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



జనగామ, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి హక్కులు, వృత్తిపరమైన భద్రత, సామాజిక, ఆర్థిక సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జనగామ గాంధీ చౌరస్తా నుంచి జర్నలిస్టులు ర్యాలీగా బయలుదేరి మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తిపరమైన భద్రత, ఉద్యోగ భద్రతతో పాటు సామాజిక, ఆర్థిక సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, జర్నలిస్టుల ఆరోగ్య రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులకు చట్టపరమైన రక్షణ కల్పించాలని, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జనగామ జిల్లా అధ్యక్షుడు ఇర్రి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుర్గిల బిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పార్నంది వెంకటస్వామి, జిల్లా కోశాధికారి ఓరుగంటి సంతోష్‌తో పాటు శ్రీబాష్యం శేషాద్రి, కొత్తపల్లి కిరణ్, కన్న పరశురాములు, కెమిడి ఉపేందర్, గణేష్, జంపాల శ్రీనివాస్, శశిధర్, రాణాప్రతాప్, తిప్పారపు ఉపేందర్, రహమాన్, మండల మోహన్, ఆకుల మహేశ్, నాసగోని శ్రీనివాస్, లావు జైపాల్‌రెడ్డి, ఎండీ ఎజాజ్, బట్టమేకల రాజు, మణి, పాలబిందెల రవీందర్, అశీష్, బాలు, అంకుశ్, శ్రీను, జితేందర్, సోమేష్, చింతకింది కిష్టమూర్తి, శివరాం, పరశురామ్, భాస్కర్, సాగర్, మధు, నవీన్, వేణుగోపాల్, మోహన్, కిరణ్, ఓంకార్, ఎల్లయ్య, నరేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలను ఆచరించాలి

- సత్యం, అహింస, పరిశుభ్రత, సేవా భావాన్ని అలవర్చుకోవాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



ఏటూరునాగారం, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, పరిశుభ్రత, సేవా భావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఓ లెనిన్ వత్సల్ టోప్పో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐటీడీఏ అధికారులు, సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. గాంధీజీ బోధించిన విలువలను జీవితంలో ఆచరించడం ద్వారా సమాజానికి మేలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ అనిల్, డీడీ జనార్ధన్, డీడీ విభాగం ఏఓ ఆత్రం లింగు, ఖాతాల నిర్వాహకుడు నర్సింగరావుతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో ప్లాస్టిక్ ఏరివేత

- అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చేపట్టిన అధికారులు



ఏటూరునాగారం, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అటవీ శాఖ అధికారులు శుక్రవారం ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఏటూరునాగారం డివిజన్ కార్యాలయం నుంచి చిన్నబోయినపల్లి పల్లె ప్రకృతి వనం వరకు, ఐటీఐ కళాశాల నుంచి జీడివాగు వరకు అటవీ శాఖ సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి నారాయణ, సెక్షన్ అధికారులు బాలాజీ, శోభారాణి, బీట్ అధికారులు దయానంద్, పవన్, ప్రశాంత్, వినోద్, కే.రాజేష్, ప్రతిభ, వేణు, రాంప్రసాద్, రాజేష్, రవి, దిలీప్, బేస్ క్యాంప్ సిబ్బంది విశ్వనాథ్, భిక్షపతి, ప్లాంటేషన్ వాచర్లు, చెక్‌పోస్ట్ వాచర్లు, ప్లాస్టిక్ సేకరణ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లంపల్లిలో ఘనంగా గాంధీజీ జయంతి వేడుకలు


- గ్రామ స్వరాజ్యమే గాంధీజీ కల..
- ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం



మల్లంపల్లి, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): మల్లంపల్లి మండల కేంద్రంలో జాతిపిత మహాత్మా గాంధీజీ 157వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంకం సురేష్, వార్డు సభ్యులు గోల్లెన సారంగపాణి, చెన్నబోయిన కవిత, జింక వేణు, దయ్యాల కవిత, మొర్రి విజయ, కొంగరి నరేందర్, వర్షం కీర్తి, కూచన సురేష్, పంజాల స్వప్న పాల్గొన్నారు. అలాగే ఏపీఓ సునీత, ఎంపీఓ మహేందర్, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు కుసుమ సునీత ముఖ్య అతిథులుగా హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో సత్యం, అహింసను ఆయుధాలుగా చేసుకుని ప్రజలను ఏకం చేసిన మహాత్మా గాంధీజీ ఆశయాలు నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయమని అన్నారు. గ్రామ స్వరాజ్యమే గాంధీజీ కల అని, ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గాంధీజీని స్మరించుకోవడం ఒక్కరోజుకే పరిమితం కాకుండా ఆయన చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గాలను నిత్య జీవితంలో ఆచరించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. సమాజంలో శాంతి, సోదరభావం, స్వచ్ఛత, సేవా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

స్టేషన్ రోడ్డులో ఘనంగా గాంధీజీ జయంతి వేడుకలు

- గాంధీజీ చూపిన శాంతి, సామరస్య మార్గంలో పయనించాలి: ఎమ్మెల్యే కొండా సురేఖ



వరంగల్ తూర్పు, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని స్టేషన్ రోడ్డులో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కొండా సురేఖ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ గాంధీజీ సూచించిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వరంగల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, మాజీ కార్పొరేటర్లు, పోటీ చేసిన కార్పొరేటర్ అభ్యర్థులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహబూబాబాద్ జిల్లాలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

- గాంధీజీ అహింస, మతసామరస్య స్ఫూర్తితో ముందుకు సాగాలి



మహబూబాబాద్ జిల్లా, కురవి–తొర్రూరు, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి); గాంధీజీ జయంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లాలోని కురవి, తొర్రూరు ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీజీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కురవి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ మతసామరస్యం, పరమత సహనానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. దేశంలో మత సామరస్యాన్ని, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడేందుకు గాంధీజీ ఆశయాల స్ఫూర్తితో ప్రజాస్వామ్యవాదులు, ప్రగతిశీల శక్తులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ పాలన విధానాలు మతసామరస్యానికి విఘాతం కలిగిస్తున్నాయని సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. మత విద్వేషాలను నివారించేందుకు ప్రజలు ఐక్యంగా నిలవాలని కోరారు.

అహింసా మార్గాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

తొర్రూరు పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి తొర్రూరు లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సుర్ణపు రాంనర్సయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ సుంకరనేని నాగవాణి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ అనుసరించిన అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేసేందుకు ప్రజలు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తొర్రూరు లైన్స్ క్లబ్ మాజీ కార్యదర్శి ముడుపు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య సాధనకు కృషి చేయాలి

తొర్రూరు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని గాంధీ సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి చాంబర్ అధ్యక్షుడు మచ్చ సురేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మచ్చ సురేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ అనుసరించిన శాంతియుత మార్గం, ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ వంటి ఉద్యమాలు చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించాయని అన్నారు. గాంధీజీ చూపిన అహింసా మార్గాన్ని నేటి యువత, ప్రజలు ఆదర్శంగా తీసుకుని తమ హక్కుల సాధనకు శాంతియుత పద్ధతులను అనుసరించాలని సూచించారు.

మహాత్మా గాంధీజీకి పోలీస్ కమిషనర్ ఘన నివాళి

- శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించాలి: సీపీ ఎన్. శ్వేత



వరంగల్, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో గాంధీజీకి ఘన నివాళులర్పించారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ ఆశయాలను



ప్రతి ఒక్కరూ ఆచరించి సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిబద్ధతతో పనిచేస్తోందని తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్‌రావు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఏఆర్, సివిల్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీజీకి నివాళులర్పించారు.

బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించడమే గాంధీజీకి నిజమైన నివాళి

- సత్యం, అహింస, శాంతి, నైతిక విలువలను ఆచరించాలి: ఏసీపీ డి. రమణబాబు



వరంగల్, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించడమే మహాత్మా గాంధీజీకి అందించే నిజమైన నివాళి అని ఏసీపీ డి. రమణబాబు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీజీ 157వ జయంతి సందర్భంగా మడికొండలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ శిక్షణ కేంద్రంలో గాంధీజీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహం వంటి మహోన్నత సిద్ధాంతాలతో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి గాంధీజీ దిశానిర్దేశం చేశారని తెలిపారు. గాంధీజీ జీవితం సత్యం, నైతిక విలువలు, నిరాడంబరత, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిందన్నారు. గాంధీజీ విశ్వసించిన అహింసా స్ఫూర్తితో సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత జీవితంలో క్రమశిక్షణ, నిజాయితీ, నైతిక విలువలను పాటించడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కె. సూర్యప్రకాశ్, 5వ బెటాలియన్ ఆర్ఐతో పాటు సివిల్, 5వ బెటాలియన్ పోలీస్ సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు.

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- అటవీ సంపద పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి: మంథని ఎఫ్ఆర్ఓ ఎం.వి. నాయక్



పెద్దపల్లి జిల్లా /మంథని, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి):వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మంథని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎం.వి. నాయక్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం మంథని అటవీ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.ఎఫ్ఆర్ఓ ఎం.వి. నాయక్ ఆధ్వర్యంలో ఖాన్సాయిపేట, భట్‌పల్లి గ్రామాల్లో కార్డన్ సెర్చ్, తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో వన్యప్రాణి వారోత్సవాలపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ నాయక్ మాట్లాడుతూ అడవులను నరికివేయడం, వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమని తెలిపారు. అటవీ సంపదను కాపాడటంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.అనంతరం శివ్వారం వన్యప్రాణి అభయారణ్యంలో అటవీ శాఖ సిబ్బంది శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఏక్లాస్‌పూర్ అటవీ ప్రాంతంలో గ్రామస్తులకు వన్యప్రాణుల సంరక్షణ, అటవీ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎఫ్ఆర్ఓ టి. సతీష్‌కుమార్‌తో పాటు మంథని, పెద్దపల్లి అటవీ రేంజ్‌ల డిప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, ఇతర అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఎల్కతుర్తి ఎస్సీ కాలనీ లోతట్టు సమస్యకు శాశ్వత పరిష్కారం

- **వర్షం వస్తే ఇళ్లలోకి చేరుతున్న వరద నీరు**
- **గ్రామసభలో అధికారులకు వినతిపత్రం అందజేసిన స్థానికులు**



ఎల్కతుర్తి, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి గ్రామంలోని ఎస్సీ కాలనీ లోతట్టు ప్రాంతంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ స్థానికులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ మునిగడప లావణ్య అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో లోతట్టు ప్రాంతానికి చెందిన కుటుంబాలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, ప్రత్యేక అధికారి ఆదిరెడ్డికి వారి తరఫున వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమ విభాగం ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు అంబాల జగన్ మాట్లాడుతూ గ్రామంలోని ఎత్తైన ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరంతా లోతట్టు ప్రాంతంలోని ఇళ్ల వైపు చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు చేరుతోందని, వర్షాకాలంలో నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతంలో సరైన మురుగునీటి కాలువలు, వర్షపు నీటి పారుదల వ్యవస్థ లేకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతోందని అన్నారు. ముఖ్యంగా దళిత కుటుంబాలు నివసించే ప్రాంతంలో ప్రతి వర్షాకాలంలో నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.సమస్యకు తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అంబాల జగన్ కోరారు. ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పరిశీలన చేపట్టి, ప్రాంత భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి సమగ్ర మురుగునీటి కాలువలు, వర్షపు నీటి పారుదల వ్యవస్థ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అవసరమైన నిధులు కేటాయించి పనులు చేపట్టి, ప్రతి వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.గ్రామసభలను నామమాత్రంగా నిర్వహించకుండా ప్రజల సమస్యలను చర్చించి, వాటికి పరిష్కార మార్గాలను రూపొందించాలని అన్నారు. గ్రామసభలో సమస్యలపై చర్చించి అవసరమైన తీర్మానాలు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడే గ్రామసభకు సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, ప్రత్యేక అధికారి ఆదిరెడ్డి, సర్పంచ్ మునిగడప లావణ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఏపీఓ అనిత, ఈసీ శ్రీకాంత్, వార్డు సభ్యులు, సీఏ కవిత, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

- **గౌరవ వేతనం రూ.25 వేలకు పెంచాలి**
- **పంచాయతీలకు రావాల్సిన నిధులు, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి: బిడ్డి మోహన్‌రావు**





ములుగు జిల్లా/తాడ్వాయి, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): సర్పంచుల సమస్యల పరిష్కారానికి జిల్లాలోని సర్పంచులంతా ఐక్యంగా పోరాడాలని ములుగు జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దిడ్డి మోహన్‌రావు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆదేశాల మేరకు తాడ్వాయి మండల కేంద్రంలో ములుగు జిల్లా సర్పంచుల ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దిడ్డి మోహన్‌రావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సర్పంచుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం సర్పంచులకు అందుతున్న రూ.6,500 గౌరవ వేతనాన్ని రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలకు రావాల్సిన రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు ప్రతి నెలా నేరుగా పంచాయతీ ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామపంచాయతీల్లో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని అన్నారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు చెల్లించాల్సిన మొత్తాలతో పాటు పనులకు సంబంధించిన వస్తు సామగ్రి నిధులను కూడా గ్రామపంచాయతీలకు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచుల సమస్యల పరిష్కారంతో పాటు గ్రామపంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వాలని దిడ్డి మోహన్‌రావు అన్నారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని సర్పంచులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ములుగు జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్ నాయక్, మాజీ ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య హాజరయ్యారు. తాడ్వాయి సర్పంచ్ ప్రవళిక, ఊరట్టం సర్పంచ్ శైలజ, బీరెల్లి సర్పంచ్ జాజ విజయ, రంగపురం సర్పంచ్ శివ, అబ్బాపురం సర్పంచ్ రాజేందర్, జంగాలపల్లి సర్పంచ్ మోహన్, బరిగిలానీపల్లి సర్పంచ్ రాజేందర్, కాసిందేవపేట సర్పంచ్ నిరోషా, శ్రీనగర్ సర్పంచ్ ఆకుల మల్లేష్, చింతగూడెం సర్పంచ్ స్వరూప, పూనుగొండ్ల సర్పంచ్ ఇర్ప సుధాకర్, నరసాపురం సర్పంచ్ గుర్రం రమాదేవి, దుంపలగూడెం సర్పంచ్ సీతారాం, బాలాజీనగర్ సర్పంచ్ గాంధీ, పాపయపల్లి సర్పంచ్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి శరన్నవరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

- **భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి**
- **మాడవీధులు, పార్కింగ్, రథం పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



వరంగల్ / భద్రకాళి దేవాలయం, అక్టోబర్ 2 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ చరిత్ర ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ శుక్రవారం సందర్శించారు. ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రీ భద్రకాళీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఆలయం చుట్టూ నిర్మాణంలో ఉన్న మాడవీధుల పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్.. ఉత్సవాల నాటికి అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్ సౌకర్యాలను కూడా పక్కాగా సిద్ధం చేయాలని ఆదేశించారు.అదేవిధంగా సుమారు రూ.కోటి వ్యయంతో దాతల సహకారంతో నిర్మిస్తున్న శ్రీపర్ణికా దారుమయ రథం పనులను పరిశీలించారు. తమిళనాడుకు చెందిన కన్యాకుమారి శిల్పులు రథాన్ని రూపొందిస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యేలోగా రథం పనులు పూర్తి చేసి దేవస్థానానికి అందించాలని శిల్పులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం, రాకపోకలు, వాహనాల నిలిపివేత తదితర అంశాలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.కార్యక్రమంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ అధికారులు, ముఖ్య ప్రణాళిక అధికారి అజిత్‌రెడ్డి, కార్యనిర్వహణ ఇంజనీర్ భీంరావు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామల సునీత, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాటాపురంలో ప్రత్యేక గ్రామసభ

- **ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
- **ఇంటింటా ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలి: సర్పంచ్ మోహన్‌రావు**





ములుగు జిల్లా/ తాడ్వాయి, అక్టోబర్02 (నిత్యం నిఘా న్యూస్): గాంధీ జయంతిని పురస్కరించుకుని తాడ్వాయి మండలంలోని కాటాపురం గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ కార్యదర్శి కోరం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన్‌రావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ శాంతి మార్గంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపించారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని అన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల్లో అమలు చేస్తున్న వీబీజీ రామ్జీ కార్యక్రమంపై గ్రామసభలో అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం ఉపాధి హామీ కార్డు కలిగి ఉండాలని సూచించారు. కాటాపురం గ్రామపంచాయతీలో ఇప్పటికే సుమారు 350 ఉపాధి హామీ కార్డులు ఉన్నాయని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. గ్రామంలో నీటిని వృథా కాకుండా సంరక్షించుకోవాలని, ప్రతి ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సర్పంచ్ సూచించారు. తద్వారా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. చెరువుల నీటిని పంట పొలాలకు అందించే కాలువలను గ్రామస్థుల సహకారంతో మరమ్మతు చేసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాలకుర్తి వెంకటరామ్ నర్సయ్య, గ్రామ పోలీస్ అధికారి రమేష్, వార్డు సభ్యులు పల్నాటి రాంబాబు, కుసుమ వెంకటేశ్వర్లు, మద్దూరి రాములు, దిలావర్ ఖాన్, గంగఎల్లి విజయ్, గంగిల్లి చంద్ర, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, వెల్ఫర్లు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సత్యం, అహింసతో స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన మహాత్మాగాంధీ

- **గాంధీజీ ఆశయాలను ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళి**
- **నవ భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: మాజీ మంత్రి కొండా సురేఖ**



వరంగల్, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): సత్యం, అహింస, శాంతి, సామరస్యాన్ని ఆయుధాలుగా చేసుకుని దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన గొప్ప దార్శనికుడు మహాత్మాగాంధీ అని మాజీ మంత్రి కొండా సురేఖ అన్నారు.గాంధీ జయంతిని పురస్కరించుకుని వరంగల్ పోస్ట్ ఆఫీస్ స్టేషన్ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహానికి శుక్రవారం కొండా సురేఖ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆదర్శప్రాయమని అన్నారు. గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని సూచించారు. సమాజంలో శాంతి, సోదరభావం, సామాజిక సమానత్వాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని కొండా సురేఖ పేర్కొన్నారు. నవ భారత నిర్మాణానికి గాంధీజీ సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకుని అందరూ కలిసి పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

27 ఏళ్ల రాజకీయ ప్రస్థానం.. శ్రీధర్‌బాబుకు ఇనుముల సతీష్ అభినందనలు

- **29 ఏళ్లకే తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన మంథని నేత**
- **మరిన్ని విజయాలు సాధించి ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్ష**



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 2 (నిత్యం నిఘా ప్రతినిధి) మంథని నియోజకవర్గ రాజకీయాల్లో ప్రవేశించి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి 27 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధరబాబుకు మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సతీష్ అభినందనలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శ్రీధర్‌బాబును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు మరణానంతరం 1999లో శ్రీధర్‌బాబు రాజకీయాల్లోకి ప్రవేశించారని ఇనుముల సతీష్ గుర్తుచేశారు. 1999 సెప్టెంబర్ 18న జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో మంథని నుంచి పోటీ చేసిన శ్రీధర్‌బాబు, అక్టోబర్ 6న వెలువడిన ఫలితాల్లో సమీప తెలుగుదేశం పార్టీ అభ్యర్థి స్వర్గీయ చందుపట్ల రాంరెడ్డిపై 15 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో తొలిసారి విజయం సాధించారని తెలిపారు.అప్పటి నుంచి ఇప్పటివరకు ఐదుసార్లు మంథని ఎమ్మెల్యేగా ఎన్నికై, రెండుసార్లు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారని సతీష్ పేర్కొన్నారు. రాజకీయ జీవితంలోకి అడుగుపెట్టి సాధించిన తొలి చారిత్రక విజయానికి అక్టోబర్ 6తో 27 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా శ్రీధర్‌బాబును అభినందించినట్లు తెలిపారు.రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి మరింత ఉన్నత పదవులు చేపట్టాలని ఈ సందర్భంగా సతీష్ ఆకాంక్షించారు. ఆయన వెంట సతీష్ భార్య ఇనుముల విజేత ఉన్నారు.

పర్వతగిరిలో గాంధీ విగ్రహావిష్కరణ

- **సత్యం, అహింస, శాంతి మార్గాలు ఆదర్శంగా నిలవాలి**
- **గాంధీజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**





పర్వతగిరి, అక్టోబర్02 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ యువత, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కుసం రాంచందర్ ఆధ్వర్యంలో గుండ వీర వెంకయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గుండ స్వయంప్రకాష్ ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సామాజిక సమానత్వం, గ్రామ స్వరాజ్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యతను పెంపొందించేందుకు గాంధీజీ సిద్ధాంతాలు నేటికీ ప్రాధాన్యత కలిగి ఉన్నాయని పేర్కొన్నారు.గాంధీజీపై ఉన్న అభిమానంతో ప్రజలకు స్ఫూర్తినిచ్చేలా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన దాత గుండ స్వయంప్రకాష్‌ను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అభినందించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి ఉష దయాకర్, పర్వతగిరి మండల అధ్యక్షురాలు సావిత్రి, సర్పంచ్ శంకర్, కల్లెడ సహకార సంఘం చైర్మన్ పిన్నింటి అనిల్‌రావు, చౌటపల్లి సహకార సంఘం చైర్మన్ అత్తి కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్, పట్టణ మాజీ అధ్యక్షుడు కుసం రామచందర్, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ డాక్టర్ గొడుగు బిక్షపతి, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలి

- **క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం: సూరపనేని నాగేశ్వరరావు**
- **ములుగు జిల్లా క్రీడాకారులకు కబడ్డీ మ్యాట్ అందించేందుకు కృషి**



ములుగు జిల్లా, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని కమ్మ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు సూరపనేని నాగేశ్వరరావు సూచించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందుతాయని అన్నారు. మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన భవిత స్వచ్ఛంద సంస్థ అధినేత కత్తి మొగిలిగౌడ్ తల్లి కత్తి బుచ్చమ్మ జ్ఞాపకార్థం శుక్రవారం క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ ఆక రవితో కలిసి సూరపనేని నాగేశ్వరరావు క్రీడాకారులకు టీషర్టులు అందజేశారు. అనంతరం క్రీడాకారులతో మాట్లాడి వారి శిక్షణ, పోటీలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ సరైన ప్రోత్సాహం, క్రీడా సామగ్రి అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో దాతలు, స్వచ్ఛంద సంస్థలు క్రీడాకారులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు.క్రీడాకారులు మరింత పట్టుదలతో సాధన చేసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ములుగు జిల్లా క్రీడాకారులకు కబడ్డీ క్రీడకు సంబంధించిన మ్యాట్ అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో ములుగు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు భూక్య రవీందర్, ప్రధాన కార్యదర్శి పోలెపాక జనార్దన్, సీనియర్ న్యాయవాది ముచ్చ రాజేందర్, పూరం ప్రసాద్, తౌటం శంకర్, చెలిమల సురేందర్, నూనావత్ శ్రవణ్, బత్తిని సురేష్, బైకని రాజు, జోగు రాజన్న, చింత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీ ధర పెరిగింది.. ముచ్చట్లకు బ్రేక్ పడింది!

- **రూ.10 నుంచి రూ.15కు చేరిన టీ.. స్నేహితుల సరదా సమావేశాలకు తగ్గిన జోష్**
- **నిత్యావసరాల ధరల పెరుగుదల ప్రభావం.. టీ కొట్ల వద్ద తగ్గుతున్న సందడి**



పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 2 (నిత్యం నిఘా ప్రతినిధి): ఒకప్పుడు టీ కొట్టు అంటే కేవలం టీ తాగే ప్రదేశం కాదు.. స్నేహితులు, పరిచయస్తులు కలుసుకునే వేదిక. ఒక టీ ఆర్డర్ చేసుకుని గంటల తరబడి ముచ్చట్లు పెట్టుకోవడం మంథని పట్టణంలో సాధారణంగా కనిపించేది. రాజకీయాల నుంచి సినిమాల వరకు, ఊరి సంగతుల నుంచి వ్యక్తిగత విషయాల వరకు ఎన్నో కబుర్లు టీ గ్లాసుల మధ్య సాగేవి. అయితే పెరుగుతున్న ధరల ప్రభావంతో ఆ సరదా సమావేశాలకు క్రమంగా బ్రేక్ పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.ఇన్నాళ్లుగా రూ.10గా ఉన్న టీ ధర తాజాగా రూ.15కు చేరడంతో టీ కొట్టు వద్ద ముచ్చట్లకు కూడా ఖర్చు పెరిగింది. ఐదుగురు స్నేహితులు కలిసి టీ తాగితే గతంలో రూ.50 ఖర్చయ్యేది. ఇప్పుడు అదే ఐదుగురికి రూ.75 అవుతోంది. పది మంది కలిసి టీ తాగితే గతంలో రూ.100 కాగా, ప్రస్తుతం రూ.150 చెల్లించాల్సి వస్తోంది. దీంతో చిన్న మొత్తమే అయినా తరచూ టీ తాగే వారికి అదనపు భారం పడుతోంది. పాలు, చక్కెర, టీ పొడి, వంటగ్యాస్ తదితర నిత్యావసరాల ధరలు పెరగడంతో టీ ధరను పెంచక తప్పడం లేదని దుకాణాల నిర్వాహకులు చెబుతున్నారు. ఒకవైపు నిర్వహణ ఖర్చులు పెరుగుతుండగా, మరోవైపు వినియోగదారులపై అదనపు భారం పడకుండా వ్యాపారం కొనసాగించడం కష్టంగా మారుతోందని పేర్కొంటున్నారు. టీ కొట్టు పేద, మధ్యతరగతి ప్రజల రోజువారీ జీవితంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. అక్కడ టీ కంటే ముచ్చట్లకే ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. రోజంతా పనుల్లో బిజీగా ఉండే వారు కాసేపు స్నేహితులతో కలిసి టీ తాగుతూ మనసు విప్పి మాట్లాడుకునేవారు. యువతకు సైతం టీ కొట్లు కలుసుకునే చిన్న వేదికలుగా ఉండేవి. అయితే టీ ధర రూ.5 పెరగడంతో ఆ చిన్న ఆనందాలపైనా లెక్కలు మొదలయ్యాయి. నలుగురైదుగురు కలిసి టీ తాగాలన్నా గతంతో పోలిస్తే ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో కొందరు టీ తాగే సంఖ్యను తగ్గించుకోవడం, ఎక్కువసేపు కూర్చోకుండా వెళ్లిపోవడం వంటి మార్పులు కనిపిస్తున్నాయని దుకాణదారులు చెబుతున్నారు.

టీ గ్లాసుతో మారుతున్న జీవనశైలి

టీ ధర పెరగడం కేవలం ఒక పానీయానికి సంబంధించిన ధర పెరుగుదలగా కాకుండా, సామాన్యుల రోజువారీ జీవనశైలిపై నిత్యావసరాల ధరల ప్రభావానికి ఉదాహరణగా మారింది. టీ రుచి పెద్దగా మారకపోయినా.. టీ చుట్టూ సాగిన ముచ్చట్లకు మాత్రం ఖర్చు పెరిగింది. ఒకప్పుడు కబుర్లకు కేంద్రంగా ఉన్న టీ కొట్లు.. ఇప్పుడు టీతో పాటు ఖర్చుల లెక్కలు వేసుకునే ప్రదేశాలుగా మారుతున్నాయనే అభిప్రాయం పట్టణంలో వ్యక్తమవుతోంది.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

- **పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరామర్శ**
- **కుటుంబ సభ్యులను ఓదార్చి.. చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు**



పర్వతగిరి, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.అన్నారం గ్రామంలో న్యాయవాది గొడుగు నికేష్, పెద్దతండాలో ప్రమాదంలో మృతి చెందిన నునావత్ భద్రు–సరోజ, బుర్గుమల్ల గ్రామంలో లక్షి చంద్ర, మంగ్య వాల్య తండాలో లకావత్ వెంకన్న, కల్లెడ గ్రామంలో బాలయ్య, గొరుగుట్ట తండాలో మూన్య మృతులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుటుంబ సభ్యులను కోల్పోవడం ఎంతో బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటూ, అవసరమైన సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలు ఒంటరిగా భావించాల్సిన అవసరం లేదని, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పర్వతగిరి మండల అధ్యక్షురాలు సావిత్రి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, సర్పంచ్ శంకర్, కల్లెడ సహకార సంఘం చైర్మన్ పిన్నింటి అనిల్‌రావు, చౌటపల్లి సహకార సంఘం చైర్మన్ అత్తి కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ డాక్టర్ గొడుగు బిక్షపతి, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- **ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దుమో సానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి: సీఐ కె. శ్రీను**



ఎల్కతుర్తి, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్కతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీను సూచించారు. ఎల్కతుర్తి మండలం పెంచికలపేట గ్రామంలో శుక్రవారం సీఐ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు వివిధ రూపాల్లో జరుగుతున్నాయని, ప్రజలు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆన్‌లైన్ రుణాల పేరుతో మోసాలు, పాక్షిక ఉద్యోగాల పేరుతో మోసాలు, పెట్టుబడుల పేరుతో మోసాలు, నకిలీ వినియోగదారుల సేవా కేంద్రాలు, ఓటీపీ, యూపీఐ మోసాలు, నకిలీ పోలీసుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపులు, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలపై ప్రజలకు వివరించారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని తెలిపారు. అనుమానాస్పద సందేశాల్లోని లింకులను తెరవడం, గుర్తుతెలియని అనువర్తనాలను ఫోన్‌లోకి తీసుకోవడం చేయకూడదన్నారు. బ్యాంకులు, ఇతర సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్‌కాల్స్, సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వారు ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ నేరాల సహాయవాణి 1930కు ఫోన్ చేయాలని, అలాగే సైబర్‌క్రైమ్ డాట్ గవ్ డాట్ ఇన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సీఐ తెలిపారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన మొత్తాన్ని నిలిపివేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ హాస్పిటల్'తో పరిశుభ్రతపై అవగాహన

- **సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుభ్రత కార్యక్రమం**
- **ప్రజారోగ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరం: బీజేపీ నాయకులు**



ఎల్కతుర్తి, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం 'స్వచ్ఛ హాస్పిటల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేశారు. ఆసుపత్రి పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. అనంతరం ప్రజలకు పరిశుభ్రత ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండటం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని నాయకులు పేర్కొన్నారు. 'స్వచ్ఛత–ఆరోగ్యం–సేవ' అనే సందేశంతో పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లెపాటి మధుకర్, కుడితాడు చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శులు అల్లి కుమార్, చిదురాల వెంకటేష్, కంచర్ల శంకరయ్య, ముషీకే వెంకటేష్, జనగాని కిష్టయ్య, ఆడెపు శ్రీ వర్ధన్, రగోతం రెడ్డి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధేయ మార్గం ఆదర్శం

- **అహింస, సత్యాగ్రహంతో స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం**
- **యువత గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి: రాదారపు శివకుమార్**



గీసుకొండ,అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు ల్యాదల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహాన్ని శుభ్రం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ మాట్లాడుతూ గాంధేయ మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. అహింస, సత్యాగ్రహాన్ని ఆయుధాలుగా మలుచుకుని మహాత్మా గాంధీ భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపించారని గుర్తుచేశారు. అహింసా మార్గంలో సుదీర్ఘ పోరాటం సాగించి దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. యువత గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను ఆచరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బిల్లా రమేష్, జిల్లా నాయకులు ఆడెపు రమేష్, కామగోని రఘుపతి, డివిజన్ ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రంజిత్, డివిజన్ నాయకులు పిల్లల రవి, లెంకలపెల్లి స్వామి, నముత బాజీ రామకృష్ణ, బండారి కుమారస్వామి, నరిశెట్టి చంద్రమౌళి, రానే రాజు, ఒడ్డబోయిన శ్రీనివాస్, ఇప్ప మల్లేశ్, గ్రామస్థులు కాంచనపెల్లి రమణకర్ రాజు, బిల్లా స్వామి, గాదం రాజు, బిల్లా మల్లయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అస్తిత్వ పరిరక్షణకు పోరాటం

- **మామునూరు విమానాశ్రయానికి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని డిమాండ్**
- **తెలంగాణ వనరులు, నీళ్లు, ఉద్యోగాలపై జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలి: తెలంగాణ అస్తిత్వ వేదిక**





హనుమకొండ, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణలో స్వయం పాలన పోయి పరాయి పాలన వచ్చిందని, రాష్ట్రం మనదే అయినా పాలన మాత్రం ఆంధ్రా కనుసన్నల్లో కొనసాగుతోందని తెలంగాణ అస్తిత్వ వేదిక చైర్మన్ వీరమళ్ల ప్రకాష్ ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం వరంగల్ నుంచే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. ఓబీసీ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని మాస్టర్‌జీ డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ అస్తిత్వ వేదిక రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వేదిక చైర్మన్ వీరమళ్ల ప్రకాష్, విశిష్ట అతిథిగా తెలంగాణ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ కారం రవీందర్‌రెడ్డి, సమన్వయకర్త శ్రీధర్ దేశ్‌పాండే పాల్గొన్నారు. తొలుత మహాత్మాగాంధీ, ప్రొఫెసర్ జయశంకర్, నల్ల నర్సింహులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా కళాకారుడు, ఉపాధ్యాయుడు, సాహితీవేత్త, జీవిత సాఫల్య పురస్కార గ్రహీత వల్లంపట్ల నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరమళ్ల ప్రకాష్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో అన్యాయం జరుగుతోందని విమర్శించారు. తెలంగాణ నీళ్లు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతున్నాయని ఆరోపించారు. జూరాల, కృష్ణా జలాల వినియోగంపై తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలోని వనరులు, నీళ్లు, ఉద్యోగాలు తెలంగాణ ప్రజలకే ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర పాలనలో ఇతర ప్రాంతాల ప్రభావం పెరుగుతోందని ఆయన ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కాపాడుతూ రాష్ట్ర అస్తిత్వాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. గత పాలనలోనూ సమస్యలు ఉన్నప్పటికీ కొన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందాయని పేర్కొన్నారు. ప్రస్తుత పాలనపై ఆయన పలు విమర్శలు చేశారు.

మేడిగడ్డపై భిన్నాభిప్రాయాలు

మేడిగడ్డ బ్యారేజీ అంశంపై ప్రభుత్వం, వివిధ సంస్థలు వెల్లడించిన అభిప్రాయాలపై ప్రకాష్ ప్రశ్నలు లేవనెత్తారు. బ్యారేజీ పిల్లర్లు దెబ్బతినడానికి కారణాలపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. వివిధ సంస్థలు పరిశీలించినప్పటికీ పూర్తి కారణాలు వెల్లడించలేదని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై సమగ్రంగా నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

మామునూరు విమానాశ్రయానికి జయశంకర్ పేరు

మామునూరు విమానాశ్రయానికి తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని వీరమళ్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణలో వరంగల్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. రామప్ప ఆలయ పరిరక్షణతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు వేదిక పనిచేస్తుందని తెలిపారు.

తెలంగాణ అస్తిత్వం ప్రశ్నార్థకం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధి జరగలేదని ఓబీసీ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ నాయకులు గద్దర్, జయశంకర్ విగ్రహాలను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయగలరా అని ప్రశ్నించారు. తెలంగాణ వనరులను తెలంగాణ ప్రజల ప్రయోజనాలకే వినియోగించాలని కోరారు.



తెలంగాణ సంస్కృతి, చరిత్రను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో అస్తిత్వ వేదిక పనిచేస్తుందని, వరంగల్ నుంచే అస్తిత్వ పరిరక్షణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

వనరుల పరిరక్షణకు ఉద్యమం

తెలంగాణ వనరులు దోపిడీకి గురవుతున్నాయని వేదిక సమన్వయకర్త శ్రీధర్ దేశ్‌పాండే ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ గేయం విషయంలో మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతుల విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని తెలంగాణ ఎన్జీవోస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక రాష్ట్రం సాధించడం మాత్రమే లక్ష్యం కాదని, అన్ని రంగాల్లో సమాన అభివృద్ధి సాధించాలన్నదే ఉద్యమ ఆకాంక్ష అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అస్తిత్వ పరిరక్షణ కోసం వరంగల్ నుంచే పోరాటాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ అస్తిత్వ వేదిక రాష్ట్ర కన్వీనర్ పిట్టల రవీందర్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, సీనియర్ జర్నలిస్ట్ బుచ్చన్న, రాష్ట్ర గెజిటెడ్ వైస్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్‌రావు, తెలంగాణ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర సలహాదారు గంగాపురం వేణుమాధవ్, డాక్టర్ జేఏసీ నాయకులు నాగేంద్ర బాబు, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరిగౌడ్, గుల్లపల్లి చిరంజీవి, పద్దిరాజు గణేష్, తాడిశెట్టి క్రాంతి, కొక్కొండ విజయబాబు, రాచకొండ ప్రవీణ్, డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, డాక్టర్ పాలమాకుల కొమరయ్య, డాక్టర్ వోడితల రాము, రావుల రాజకుమార్, గుండేటి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచిన కేసీఆర్: గండ్ర జ్యోతి

- **కళ్యాణలక్ష్మి పథకం ఓ పేద కుటుంబం కన్నీటి నుంచి పుట్టిన మానవీయ ఆలోచన**
- **కేసీఆర్ అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే కేసీఆర్: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు**







ములుగు జిల్లా, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని, ఈ పథకం ద్వారా ఎంతోమంది కుటుంబాలకు అండగా నిలిచారని బీఆర్ఎస్ నాయకురాలు, భూపాలపల్లి జిల్లా మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. కేసీఆర్‌కు కృతజ్ఞతగా ములుగు జిల్లా మల్లంపల్లి మండలం భాగ్య తండాలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 2014 అక్టోబర్ 2న కళ్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భాగ్య తండాలో అగ్నిప్రమాదంలో పేద కుటుంబం సర్వం కోల్పోయి, ఆ కుటుంబంలోని ఆడబిడ్డ వివాహం ఆగిపోయిన ఘటనను అప్పట్లో కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారని గండ్ర జ్యోతి గుర్తు చేశారు. ఆ ఘటనను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ వివాహం కూడా ఆర్థిక ఇబ్బందులతో ఆగకూడదనే ఉద్దేశంతో కళ్యాణలక్షి , షాదీ ముబారక్ పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. 2014లో రూ.51,116 ఆర్థిక సహాయంతో ప్రారంభమైన పథకం అనంతరం రూ.75,116కు, ఆపై రూ.1,00,116కు పెరిగిందని గండ్ర జ్యోతి పేర్కొన్నారు. దివ్యాంగుల వివాహాలకు రూ.1,25,000 వరకు ఆర్థిక సహాయం అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. కళ్యాణలక్షి తో పాటు కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి పథకాల ద్వారా మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు భరోసా కల్పించారని చెప్పారు. కేసీఆర్ అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే కేసీఆర్ అని గండ్ర జ్యోతి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని అన్నారు. కళ్యాణలక్షి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.13,500 కోట్ల ఆర్థిక సహాయం అందించారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలపై కూడా ప్రజలకు సమాధానం చెప్పాలని గండ్ర జ్యోతి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన తులం బంగారం హామీ ఏమైందో ప్రజలకు వివరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కష్టాలు, కన్నీళ్లు వస్తాయని కేసీఆర్ గతంలో హెచ్చరించారని, ప్రస్తుతం పరిస్థితులను ప్రజలు ఒకసారి ఆలోచించాలని ఆమె అన్నారు.ఈ సందర్భంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్మాగాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మహిళలకు చీరలను అందజేసి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ చీఫ్ విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీత, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర తొలి మహిళా అధ్యక్షురాలు తుల ఉమ, మాజీ జడ్పీ చైర్‌పర్సన్లు బిందు, బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్‌రావు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవిందు నాయక్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, భాగ్య తండా ప్రజలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com

ఏటూరునాగారంలో వివాహిత మృతి

- అదనపు కట్నం, భూమి కోసం వేధించారంటూ కుటుంబ సభ్యుల ఫిర్యాదు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



ఏటూరునాగారం, అక్టోబర్ 2 (నిత్యం నిఘా ప్రతినిధి): ఏటూరునాగారం, అక్టోబర్ 2 (నిత్యం నిఘా ప్రతినిధి):ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత మృతి చెందింది. అదనపు కట్నం, భూమి కోసం భర్త, అత్తమామలు వేధించడంతోనే తమ కుమార్తె మృతి చెందిందని ఆరోపిస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం.. రోహీర్ గ్రామానికి చెందిన స్వర్ణలత (25) అదే గ్రామానికి చెందిన హరీష్ (28)ను 2025 మే 29న ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం స్వర్ణలత నాలుగు నెలల గర్భిణిగా ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అదనపు కట్నం, భూమి కోసం తన కుమార్తెను భర్త హరీష్, అత్త వజ్రమ్మ, మామ లింగయ్య శారీరకంగా, మానసికంగా వేధించారని మృతురాలి తండ్రి దుర్గం లక్ష్మీనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆరోపించారు.ఈ క్రమంలో అక్టోబర్ 2న ఉదయం సుమారు 9 గంటల సమయంలో స్వర్ణలత గుర్తుతెలియని పురుగుమందు సేవించినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. వెంటనే ఆమెను ఏటూరునాగారంలోని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, ఉదయం సుమారు 10 గంటలకు వైద్యులు ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.ఈ ఘటనపై ఏటూరునాగారం పోలీసులు నేర సంఖ్య 169/2026, భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 80 కింద కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని, సాక్ష్యాధారాల ఆధారంగా చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

మాదకద్రవ్యాలపై పోలీసుల నిఘా.. నలుగురు అరెస్ట్

- తనిఖీల్లో మాదకద్రవ్యాలు స్వాధీనం
- సరఫరా గొలుసుపై కొనసాగుతున్న దర్యాప్తు:ఎస్సై మహేష్







ఏటూరునాగారం, అక్టోబర్02 (నిత్యం నిఘా ప్రతినిధి): ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన తనిఖీల్లో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులను జగదీష్ (ఏ1), రామ్‌చరణ్ తేజ్ (ఏ2), ఆకుల వంశీ (ఏ3), వర ప్రసాద్ (ఏ4)గా గుర్తించారు. ఆకుల వంశీ వయస్సు 28 సంవత్సరాలు కాగా, సీతానగరం గ్రామం, దుమ్ముగూడెం మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు తెలిపారు. అతను పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో ఏ1, ఏ3 వద్ద నుంచి మాదకద్రవ్యాలను కొనుగోలు చేసినట్లు, ఏ3 మాదకద్రవ్యాలను ఏ4 వద్ద నుంచి కొనుగోలు చేసినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాల అసలు మూలం, వాటి సరఫరా గొలుసుపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్సై మహేష్ పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను సీజ్ చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

ఘనంగా గాంధీ జయంతి.. గ్రామసభకు డుమ్మా

- చండ్రుపట్లలో గ్రామసభ నిర్వహణ.. సమస్యలు, అభివృద్ధి పనులపై చర
- ఉపసర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు గైర్హాజరుపై గ్రామస్తుల అసంతృప్తి





ములుగు జిల్లా/ వాజేడు, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): వాజేడు మండలం చండ్రుపట్ల గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు, గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ అనుముల సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి బంధం రవీందర్ గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి గ్రామంలో నెలకొన్న సమస్యలు, పారిశుద్ధ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామ అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అంశాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిపారు. అయితే ప్రభుత్వ కార్యక్రమాల్లో కీలకమైన గ్రామసభకు ఉపసర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. గ్రామ అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకమైనప్పటికీ వారు గ్రామసభకు గైర్హాజరు కావడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై చర్చించే గ్రామసభకు ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడం వల్ల సమావేశం ప్రాధాన్యత దెబ్బతింటోందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్త బాగుతు సమ్మక్క, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు విజయనిర్మల, ఆలం పద్మ, సీనియర్ మేట్ గోగు తిరుపతిరావు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ అహింసా మార్గం అందరికీ ఆదర్శనీయం - సర్పంచ్ అరిగెల అలివేలు



నిత్యం నిఘా, పినపాక, అక్టోబర్ 02 : భారత స్వాతంత్ర ఉద్యమంలో కీలక నాయకుడిగా, అహింసా తత్వానికి మార్గదర్శకుడిగా మహాత్మా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని పినపాక మండల కేంద్రంలోని మోహన్ దాస్ కరంచంద్ గాంధీ విగ్రహానికి స్థానిక సర్పంచ్ అరిగెల అలివేలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ యువత ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ అరిగేల అలివేలు మాట్లాడుతూ గాంధీజీ జయంతి రోజున ఐక్యరాజ్యసమితి అహింసా దినోత్సవం గా ప్రకటించడం జరిగిందని జాతీయ పితామహుడుగా అభివర్ణించిన గాంధీ జయంతిని జరుపుకోవడం గర్వకారణంగా ఉందని అన్నారు. గాంధీజీ ఆశయాలను, బ్రిటిష్ వలస పాలకుల నుండి భారతదేశానికి స్వాతంత్రాన్ని తీసుకువచ్చిన విజయ పోరాటాన్ని ప్రతి ఒక్క పౌరుడు ఆదర్శంగా తీసుకొని సమాజానికి తన వంతు బాధ్యతగా మహాత్మా గాంధీ ఆశయాలని ఆచరణలో పెట్టాలని గ్రామ యువతను కోరారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల స్వతంత్ర రెడ్డి, మహమ్మద్ యాకుబ్ పాషా, సోంబోయిన ప్రసాద్,గోగ్గల చిట్టెమ్మ, జి. సురేష్ ,గ్రామస్తులు, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీకి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఘన నివాళి

- అహింస, సత్యాగ్రహ మార్గంలో గాంధీజీ పోరాటం చిరస్మరణీయం
- శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించాలి: ఎమ్మెల్యే



భద్రాచలం, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి); మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు. భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, పాత మార్కెట్ సెంటర్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహ మార్గంలో సాగించిన పోరాటం, దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.బలంతో బలహీనతను జయించడం కంటే అహింస, సత్యం ద్వారా అన్యాయాన్ని ఎదుర్కోవడమే గాంధీజీ చూపిన మార్గమని తెలిపారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించాలని కోరారు.కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, ఉపసర్పంచ్ రత్నం కవిత, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల రక్షణకు సమగ్ర చట్టం తీసుకురావాలి.



నిత్యం నిఘా, భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 02 జర్నలిస్టుల భద్రత, సంక్షేమం కోసం జాతీయ చట్టం తీసుకురావాలని, హెల్త్ కార్డులు, పక్కా గృహాలు కల్పించాలని, జర్నలిస్టుల పిల్లలకు పాఠశాల ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని టి యు డబ్ల్యూ జే – ఐజేయు భద్రాచలం డివిజన్, పట్టణ కమిటీలు డిమాండ్ చేశాయి. శుక్రవారం అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు బి.వి. రమణారెడ్డి, పట్టణ అధ్యక్షులు విజ్జిగిరి రాజా కిరణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణకు నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, రద్దైన వర్కింగ్ జర్నలిస్టుల చట్టాల కింద హక్కులను పునరుద్ధరించాలని, కొత్త వేతన మండలి ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఒకే కాన్పు.. రెండు ఆసుపత్రులు!

- కవలల ప్రసవంలో అరుదైన ఘటన.. గంటన్నర వ్యవధిలో ఇద్దరి జననం
- మణుగూరు, భద్రాచలం వైద్యుల సమన్వయంతో తల్లీబిడ్డలు క్షేమం



మణుగూరు–భద్రాచలం, అక్టోబర్ 02 (నిత్యం నిఘా ప్రతినిధి): ఒకే తల్లి కడుపున పుట్టిన కవలలు వేర్వేరు ఆసుపత్రుల్లో, గంటన్నర వ్యవధిలో జన్మించిన అరుదైన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది. మణుగూరు, భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య బృందాలు సకాలంలో స్పందించి సమన్వయంతో చికిత్స అందించడంతో తల్లితో పాటు ఇద్దరు శిశువులు క్షేమంగా ఉన్నారు. గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు తొలుత మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సాధారణ ప్రసవం నిర్వహించగా రాత్రి 11 గంటలకు 1.6 కిలోల బరువున్న మగబిడ్డ జన్మించాడు. అయితే రెండో బిడ్డ ప్రసవానికి వచ్చే సమయంలో బాలింతకు తీవ్ర రక్తహీనత, అధిక రక్తపోటు వంటి సమస్యలు తలెత్తినట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితి విషమించే అవకాశం ఉండటంతో మణుగూరు వైద్యులు వెంటనే అత్యవసర చర్యలు చేపట్టి మెరుగైన వైద్య సేవల కోసం అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్య బృందం పరిస్థితిని అంచనా వేసి అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించింది. రాత్రి 12:30 గంటలకు 2.2 కిలోల బరువున్న ఆడబిడ్డ జన్మించింది. ఒకే కాన్పులో మొదటి శిశువు సాధారణ ప్రసవం ద్వారా మణుగూరు ఆసుపత్రిలో, రెండో శిశువు శస్త్రచికిత్స ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో జన్మించడం ఈ ఘటనలో ప్రత్యేకతగా నిలిచింది. సకాలంలో స్పందించి తల్లిని భద్రాచలానికి తరలించడం, అక్కడ వైద్యులు అత్యవసర శస్త్రచికిత్స చేయడంతో తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. వైద్యుల సమన్వయం, సిబ్బంది అంకితభావంతో క్లిష్ట పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొన్న రెండు ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య బృందాలను పలువురు అభినందిస్తున్నారు.